ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 25 నవంబరు 2025 | 5



## మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్.. గుండెపోటుతో మృతి

- మృతికి సంతాపంగా మండపేటలో దుకాణాల బంద్
- నివాళులర్పించిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్
- తరలివచ్చిన నాయకులు, వ్యాపారవేత్తలు 7



చుండ్రు శ్రీవరప్రకాష్(ఫైల్)

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.70 లక్షలు 7

## మోరిలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

- 13 జిల్లాల నుంచి పాల్గొన్న 312 మంది విద్యార్థులు 7

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లకు ద్వితీయస్థానం

## ముగ్గురు మోటారుసైకిళ్ల దొంగల అరెస్ట్ 7

# షష్ఠికి ఆలయాలు ముస్తాబు

- నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



అతిపెద్దదైన ఎ.వేమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం

అమలాపురంరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):షష్ఠి మహోత్సవాలకు జిల్లావ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. స్వామి అతిపెద్ద విగ్రహాలు కొన్ని చోట్ల మాత్రమే ఉన్నాయి. వాటిలో 42అడుగుల ఎత్తులోఉన్న అతిపెద్ద విగ్రహం అమలాపురంరూరల్ మండలం ఎ.వేమవరం గ్రామంలో ఉండడం విశేషం. మలేషియా తరహాలో అతిపెద్ద విగ్రహాన్ని ఇక్కడ నిర్మించారు. స్వామికి రక్షణ పడగగా 45అడుగుల నాగరాజు నిలబడి ఉండడం మరో విశేషం. ఎ.వేమవరంలో ప్రసిద్ధినొందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి 7.30గంటలకు గూడా సత్యహరిశ్చంద్రుడు కుటుంబీకుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ధర్మకర్త కొంపెల్ల వెంకటశ్రీనివాస్, భక్త బృందం తెలిపింది. 85ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. దేవస్థానం చైర్మన్ కొంపెల్ల వెంకటశ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం 26న షష్ఠి తీర్థం జరుగుతోంది.

### పుట్టలో కొలువైన నాగదేవత

నడిపూడి శివారు మెట్ల రాంజీ కాలనీలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం(పుట్ట ఆలయం) వద్ద షష్ఠి తీర్థానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. బండారులంక శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తారు. రంగాపురంలోని అతి పురాతనమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం కల్యాణోత్సవాలకు ముస్తాబైంది.



కేశనపల్లి-శంకరగుప్తం డ్రెయిన్ పరిధిలో ఉప్పునీటి వల్ల నిర్జీవమైన కొబ్బరి తోటలు

బంగాళాఖాతం సముద్ర తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో మురుగునీరు దిగేందుకు ఏర్పాటైన శంకరగుప్తం-కేశనపల్లి ప్రధాన డ్రెయిన్‌లో ఉప్పునీరు వెనక్కు మళ్లడం వల్ల డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న పరీవాహక గ్రామాలకు చెందిన వందల ఎకరాల్లోని వేలాది కొబ్బరి చెట్లు నిర్జీవయ్యాయి. ఫలితంగా వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో డ్రెయిన్ ముఖ ద్వారం వద్ద చేసిన డ్రెడ్జింగ్ ఫలితంగా ఉప్పునీరు అనూహ్యంగా వెనక్కు పోటెత్తడంతో ఆ ప్రధాన డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న వేలాది కొబ్బరిచెట్లు ఉప్పునీటి సాంద్రతతో చెట్ల తలలన్నీ తెగిపడ్డాయి. దీంతో రైతులు ఆందోళనకు గురై ప్రభుత్వం ఆదుకోవాలంటూ చేసిన విజ్ఞప్తులను పురస్కరించుకుని ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి కె.పవన్‌కల్యాణ్ బుధవారం ఆ ప్రాంతంలో పర్యటించనున్నారు. కొబ్బరి రైతులకు జరిగిన నష్టానికి గల కారణాలను రైతుల నుంచి అడిగి తెలుసుకోనున్నారు.

# ఉప్పునీరు పోటెత్తి.. కొబ్బరి ఉసురు తీసింది!

- నిర్జీవమైన వందల ఎకరాల్లో వేలాది కొబ్బరిచెట్లు
- ఆనాటి డ్రెడ్జింగ్‌తో ఉప్పునీరు మళ్లి పంటలకు నష్టం : రైతులు
- చింతలమోరి నుంచి కరవాక వరకు 22.90 కిలోమీటర్ల పొడవున డ్రెయిన్
- డ్రెయిన్‌లో పూడికతీత పనులే శరణ్యం.. కమిటీ సిఫార్సు
- రూ.21 కోట్లతో ప్రతిపాదన ఆర్థికశాఖకు : మంత్రి నిమ్మల
- రేపు డ్రెయిన్ ప్రాంతంలో డిప్యూటీ సీఎం పర్యటన
- పవన్ పర్యటనపైనే ఆశలు పెట్టుకున్న కొబ్బరి రైతులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో ముఖ్యమైన శంకరగుప్తం-కేశనపల్లి డ్రెయిన్ మలికిపురం మండలం చింతలమోరిలో ప్రారంభమై కేశవదాసుపాలెం, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, కరవాక గ్రామాల మీదుగా 22.90 కిలోమీటర్ల పొడవున ఈ ప్రధాన డ్రెయిన్ ప్రవహిస్తుంది. 57,619 క్యూసెక్కుల నీరు వైనతేయ గోదావరిలో కలుస్తుంది. దీనినే రక్తతుల్య నది అని కూడా పిలుస్తారు. ఈ కాల్వగుండా మూడు మీడియం డ్రెయిన్లు, 12 మైనరు డ్రెయిన్లు, 27 స్థానిక రెవెన్యూ డ్రెయిన్ల నుంచి నీటి ప్రవాహం శంకరగుప్తం డ్రెయిన్‌లో కలిసి గోదావరిలోకి వెళుతుంది. అయితే ఈ డ్రెయిన్ వైనతేయ గోదావరి కుడివైపున కుంగిపోయి బంగాళాఖాతంలో కలుస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నదిలో కలిసే చోట వరదలు, భారీ వర్షాల సమయంలో 22.90 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ డ్రెయిన్‌లోకి ఉప్పునీరు వెనక్కి మళ్లుతుంది. అయితే 2003-04లో 16.50 కిలోమీటరు నుంచి 22.90 కిలోమీటరు వరకు అప్పట్లో డ్రెయిన్ తవ్వారు. మళ్లీ 2017-18లో 0.00 నుంచి 8.50 కిలోమీటర్ల వరకు డ్రెడ్జింగ్ చేసి ప్రవాహ వేగాన్ని మెరుగుపరిచారు. అయితే రెండు పనుల్లోను 8.50 కిలోమీటర్ల నుంచి 16.50 కిలోమీటర్ల వరకు రీచ్‌లు మిగిలిపోయాయి. అయితే ఈ ప్రాంతంలో భారీగా సిల్టు ఉండడం వల్ల బెడ్ లెవెల్ దాదాపు 1.00 నుంచి 1.50 మీటర్ల వరకు తగ్గింది. ఈ సిల్టు కాల్వ సామర్థ్యాన్ని గణనీయంగా తగ్గించడం వల్ల వరదనీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఫలితంగా డ్రైనేజీ నీరు పొంగి పొర్లడంతో సమీపంలో ఉన్న కొబ్బరి చెట్లు, ఇతర పంటలు ముంపునకు గురై చనిపోతున్నాయి. దీని పునరుద్ధరణ కోసం డ్రైనేజీశాఖ రూ.21 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇప్పుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అవన్నీ పరిశీలించిన తరువాత తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రైతులు, అధికారులు భావిస్తున్నారు.

### తవ్వకం వల్లే మోక్షం



శంకరగుప్తం డ్రెయిన్‌లోకి సముద్రం పోటు కారణంగా కొబ్బరిచెట్లు మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు తెలిపారు. శంకరగుప్తం కాలువ వెంబడి ఉన్న పెద్ద ప్రాంతమని ఈ ప్రాంతంలో కొబ్బరి చెట్లు 40 సంవత్సరాలు పైబడి ఉన్నాయన్నారు. 2017 నుంచి ఆ ప్రాంతంలో కాలువ ద్వారా సముద్రపు ఉప్పు నీరు వెనక్కి రావడంతో కొబ్బరిచెట్లు ఎక్కువగా మరణిస్తున్నాయన్నారు. ఈ కాలువ ద్వారా నీరు మళ్లేందుకు 9 కిలోమీటర్ల మేర మాత్రమే తవ్వకాన్ని చేపట్టారన్నారు. ప్రభావిత ప్రాంతం తీరానికి శంకరగుప్తం దగ్గరగా ఉండటంతో ఆటుపోట్లు సమయంలో సముద్రపు నీరు అక్కడ ఉన్న కాలువలోకి ప్రవేశించి అనంతరం పక్కనే ఉన్న కొబ్బరి తోట్లలోకి పొంగి ప్రవహిస్తుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం కారణంగా మురుగునీరు ముందుకు వెళ్లడంలేదని తెలిపారు. ఇది పంట ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. శంకరగుప్తం డ్రైనేజీ కాలువ తవ్వకాల ఆపరేషన్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

### రూ.21 కోట్లతో ప్రతిపాదనలు

ఇప్పటికే ఈ సమస్యపై జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆ ప్రాంతంలో పర్యటించి నిపుణుల అధ్యయన కమిటీని కూడా నియమించి రూ.21 కోట్ల అంచనా వ్యయంతో డ్రెయిన్‌లో పూడికతీత పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి రాష్ట్ర ఆర్థికశాఖకు ఆమోదం నిమిత్తం పంపించారు. 13 గ్రామాలకు చెందిన కొబ్బరి, ఇతర రైతులకు మేలు చేసేందుకు ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం క్లియరెన్సు ఇవ్వాలని ఆయన కోరారు. శంకరగుప్తం-కేశనపల్లి ప్రధాన డ్రెయిన్‌కు సంబంధించి తలెత్తిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తున్నారు. శంకరగుప్తం డ్రెయిన్ తరహా పరిస్థితులు ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెడ్జింగ్ వల్ల ఉప్పునీటి సాంద్రత అనూహ్యంగా పెరగడం వల్ల ఆక్వా రైతులకు మేలు చేస్తున్నప్పటికీ కొబ్బరి, వరి పంటలు సాగు చేసుకునే రైతులకు శాపంగా మారింది.

## అభివృద్ధి ప్రతిబింబించేలా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలి

- డిప్యూటీ సీఎం పవన్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమానికి సంబంధించిన 26 జిల్లాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని ప్రతిబింబించేలా ఛాయాచిత్ర ప్రదర్శనను నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం రాష్ట్ర సంచాలకుడు వై.షణ్ముకకుమార్‌తో ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై సోమవారం ముందస్తు సమీక్ష నిర్వహించారు. ఈనెల 26న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటనకు సంబంధించి బహిరంగ సభాస్థలి వద్ద రాష్ట్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు స్పష్టంగా ప్రతిబింబించేలా ఛాయాచిత్ర ప్రదర్శన పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. పంట రక్షణ విద్య, ఆరోగ్య, గృహనిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక రంగాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను తిలకించే అవకాశాన్ని ప్రజలకు కూడా కల్పించాలన్నారు. డీఆర్వో మాధవి, డ్వామా పీడీ మధుసూదన్, పంచాయతీ రాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయండి

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈనెల 26న రాజోలు నియోజకవర్గంలో జరగనున్న పర్యటన నేపథ్యంలో శివకోడు వద్ద జరిగే బహిరంగ సభ వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులతో శివకోడులో జరిగే ఏర్పాట్లపై సమీక్షించారు. పర్యటనకు భారీసంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశంఉన్న దృష్ట్యా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. శంకరగుప్తం డ్రెయిన్ వల్ల తలెత్తిన సమస్యలను ప్రతిబింబించే రీతిలో నివేదికలు, రైతుల ఇబ్బందులను వివరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీకర్, దేవరకొండ అఖిల, డ్రెయిన్స్ ఈఈ కిశోర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, అటవీశాఖ అధికారి ప్రసాదరావు, ఆర్ అండ్‌బీ, పర్యవేక్షక ఇంజనీర్ రాము, జలవనరులశాఖ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు: డీఈవో

ముమ్మిడివరం,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి నిర్వహించనున్నట్టు డీఈవో సలీంబాషా తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 12,719మంది, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 6,888మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గతేడాది రాష్ట్రస్థాయిలో జిల్లా ఉత్తీర్ణతలో రెండోస్థానంలో నిలిచిందని, ఈ ఏడాది ప్రథమస్థానం సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్టు ఆయన తెలిపారు. పదో తరగతి పరీక్షల ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ ఏడాది ఫిజిక్స్, కెమిస్ట్రీలు కలిసి ఒకే పేపరుగా, జీవశాస్త్రం మరో పేపరు విడివిడిగా నిర్వహిస్తారన్నారు. పేపరుకు 50 మార్కుల చొప్పున పరీక్షలు ఉంటాయని, ఈసారి పరీక్షల మధ్య విరామం వచ్చిందని అన్నారు.

## గీత ఉపకులాలకు మీరు ఏం చేశారు?

- వేణుకు మంత్రి సుభాష్ కౌంటర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్లపాలనలో గీత ఉపకులాలకు ఏం చేశారో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు చెప్పాలని, తదుపరి చర్చకు సిద్ధమవుదామని మంత్రి సుభాష్ సవాల్ చేశారు. రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023, ఫిబ్రవరి 23న వైసీపీ హయాంలో చెల్లుబోయిన వేణు తీసుకువచ్చిన మెమోలో గౌడ అని రాసి శెట్టిబలిజను ఉపకులంగా చూపారన్నారు. ఆయన మంత్రిగా ఉండగా ఇచ్చిన మెమో అధికారులు ఇచ్చారని, తనకు తెలియదని చెప్పడం ఏంటని విమర్శించారు. సాష్టాంగ నమస్కారాలతో జాతి మనోభావాలు దెబ్బతీశారని,ఇందుకు మీరు జాతికి క్షమాపణ చెప్పారా అని ప్రశ్నించారు.



# 'దారి'కి తెస్తున్నారు!

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా మారిన రహదారులకు మంచిరోజులు వస్తున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో రహదారుల దారుణ దుస్థితిపై వచ్చిన కథనాల నేపథ్యంలో డిసెంబరు నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వచ్చే నెలలోగా మొత్తం రూ.110కోట్లకుపైగా నిధులు వెచ్చించి రహదారులను దారికి తేవడానికి సిద్ధమయ్యారు. తాజాగా ఉమ్మడి జిల్లాకు రూ.49.50 కోట్లు మంజూరవగా, వీటితో పలు కీలక రహదారులను రిపేర్లు చేయడానికి నిర్ణయించారు. త్వరలో వీటికి టెండర్లు పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయబోతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- నరకప్రాయంగా మారిన రోడ్ల రిపేర్లకు రూ.49.50 కోట్లు మంజూరు
- కాకినాడ జిల్లాలో 7 రోడ్లకు 16.21కోట్లు, కోనసీమలో రూ.30 కోట్లు
- రాజమహేంద్రవరంలో కేశవరం-బొమ్మూరు రోడ్డుకు రూ.2.78 కోట్లు
- వీటికి టెండర్లు పూర్తయ్యాక మరో రూ.60 కోట్లతో మిగిలినవీ దారికి..
- 'ఆంధ్రజ్యోతి' కథనాల నేపథ్యంలో రోడ్ల మరమ్మతులకు సీఎం ఆదేశం

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో రహదారులు గోతులమయంగా మారాయి. అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరకప్రాయంగా మారాయి. ఏటా వర్షాలు, వరదలతో పట్టణాల నుంచి గ్రామాల వరకు రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. అయితే వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లపాటు వీటిని పూర్తిగా గాలికి వదిలేసింది. జనం గోతుల రహదారుల్లో ప్రయాణించి మృత్యువాత పడడం, తరచు గాయాలపాలవుతున్నా వైసీపీ ప్రభుత్వం ఏనాడూ కనీసం పట్టించుకోలేదు. ఆ తర్వాత గడచిన ఏడాదిన్నరలో కోనసీమలో భారీ వర్షాలు, మూడుసార్లు గోదావరి వరద, తుఫాన్లతో రోడ్లన్నీ మరింత దారుణంగా మారాయి. అటు తూర్పుగోదావరి జిల్లాలో భారీవర్షాలు, తుఫాన్ల ప్రభావంతో వందల కిలోమీటర్ల మేర రోడ్ల రూపురేఖలు కోల్పోయాయి. అలాగే కాకినాడ జిల్లాలోను భారీవర్షాలు, తుఫాన్లు, ఏలేరు వరదతో రోడ్లన్నీ వందల కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. అయితే వీటిని చాలావరకు ప్రభుత్వం మరమ్మతులు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి నాటికి రహదారుల కింద యుద్ధప్రాతిపదికన గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిన రోడ్డన్నింటినీ మరమ్మతులు చేసింది. ఒక్క కాకినాడ జిల్లాలో 119 రహదారులను రూ.31.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చింది. అలాగే కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రూ.62కోట్లతో రిపేర్లు చేసింది. అయితే ఇవి చేయగా ఇంకా వందల కిలోమీటర్ల కొద్దీ రహదారులు మురమ్మతులకు నోచుకోలేదు. పైగా ఈలోపు ఈ ఏడాదిలో కురిసిన వర్షాలు, తుఫాన్ల ముప్పుతో ఆ రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కాకినాడ-సామర్లకోట రహదారిని రూ.1.50 కోట్లతోను, కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును రూ.80 లక్షలతోను, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోను అనేక రహదారులను మరమ్మతులు చేయగా, మళ్లీ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అధ్వాన దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాలు ప్రచురించింది. అటు రాష్ట్రవ్యాప్తంగాను అన్ని జిల్లాల్లో రోడ్ల దుస్థితిపై వెలువడిన కథనాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తక్షణం అన్నింటికి మరమ్మతు చేయాలని, డిసెంబరుకి ఎక్కడా రోడ్లపై గుంతలు కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వచ్చేనెల మొదట్లో రూ.49.50 కోట్లతో పలు రహదారుల మరమ్మతుకు ఆర్అండ్‌బీ సన్నద్ధమైంది.

### ఆ జిల్లాలో రూ.30 కోట్లతో...

కోనసీమ జిల్లాలో ఇప్పటికే ఈ ఏడాది జనవరినాటికి పాట్ హోల్ ఫ్రీ కింద రూ.45 కోట్ల వరకు వెచ్చించి ప్రభుత్వం రహదారులను మరమ్మతు చేసింది. మిగిలిన రహదారులపైనా దృష్టిసారించింది. తాజాగా రూ.30 కోట్లతో 12 కీలక రహదారులను అద్దంలా మార్చబోతోంది. ముఖ్యంగా ముమ్మిడివరం-ముక్తేశ్వరం రహదారి మరమ్మతులకు రూ.1.67కోట్లు కేటాయించింది. ముమ్మిడివరం- కాట్రేనికోన ఐనాపురం రోడ్డుకు రూ.2.92కోట్లు, రాజవరం- పొదలాడ రూ.3.11కోట్లు, ఉప్పలగుప్తం మండలంలో సిరిపల్లి-మునిపల్లి రహదారి మరమ్మతుకు రూ.2.28 కోట్లు, ఐ.పోలవరంలో మురమళ్ల-ఎదుర్లంక రోడ్డుకి రూ.40.22 లక్షలు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రూ.1.67 కోట్లు, కాకినాడ జిల్లాలో సర్పవరం జంక్షన్ నుంచి లైట్‌హౌస్ పేట రోడ్డుకు రూ.1.97కోట్లు, తుని ఎర్రకోనేరు నుంచి వేమవరం రోడ్డుకు రూ.3.01కోట్లు, కత్తిపూడి పామర్రు రోడ్డు గొల్లప్రోలు పరిధిలో రూ.3.16 కోట్లు, తుని కత్తిపూడి రోడ్డు రూ.2.54కోట్లు, గండేపల్లి మండలం తాళ్లూరు-ఎల్లమిల్లి రూ.1.59 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గం పరిధిలో నరసాపురపుపేట-కాట్రావులపల్లి రహదారికి రూ.1.60 కోట్లు, కాజులూరు మండలం శలపాక-కాజులూరు రహదారి మరమ్మతుకు రూ.2.34 కోట్లు వెరసి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.16.21 కోట్లు మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. అలాగే రాజమహేంద్రవరంలో కేశవరం వయా బొమ్మూరు రోడ్డు మరమ్మతుకు రూ.2.78 కోట్లు కేటాయించింది. వీటన్నింటికి ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా, వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభించి రహదారులను తీర్చిదిద్దడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అలాగే ఇవి పూర్తయ్యేలోగా మరో రూ.60 కోట్లతో ఉమ్మడి జిల్లాలో తుఫాన్లు, వరదలు, భారీవర్షాలకు దెబ్బతిన్న మిగిలిన రహదారులను కూడా మరమ్మతు చేయనున్నారు. వీటిలో ఒక్క కాకినాడ జిల్లాలోనే మొంథా తుఫానుకు దెబ్బతిన్న రహదారులకు రూ.30 కోట్లకుపైగా నష్టం వాటిల్లగా వాటికి రిపేర్లు చేయనున్నారు. అలాగే ఇటీవల వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న కాకినాడ-సామర్లకోట రోడ్డుని ప్రభుత్వం రూ.2.50కోట్లతోను. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును అరకోటికిపైగా వెచ్చించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది.

## 'పీజీఆర్ఎస్'కు 200 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురంటౌన్,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 200 అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించినప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు 200 అర్జీలను స్వీకరించారు. డీఆర్వో మాధవి, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, డీఎల్డీవో రాజేశ్వరరావు పాల్గొన్నారు. ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్దేశిత రుసుం కంటే అత్యధికంగా వసూలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని న్యాయవాది బొంతు వెంకటేశ్వరరావు అర్జీ అందించారు.

## ఎస్పీకి 27 అర్జీలు

అమలాపురంటౌన్,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలకు సత్వర న్యాయం అందించేలా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లాఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన పీజీఆర్ఎస్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి 27అర్జీలను స్వీకరించారు.



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ రాహుల్‌మీనా



తాటిపర్తిలో స్వామి నిజరూప దర్శనం

# సుబ్రహ్మణ్య షష్ఠికి ముస్తాబు

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంల్లో విస్తృత ఏర్పాట్లు**

**స్వయంభూ ఆలయాల్లో రాత్రిపూట నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మకం**

(గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ స్వామి వారి విగ్రహం వద్ద పాము కొంతకాలంగా పాటు ఉండి అక్కడే చనిపోవడంతో ఆ స్థానంలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి సమీపంలోనే అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయం ఉండడంతో మరింత ప్రాశస్త్యం లభించింది. సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎరుపు రంగు చారల చీర కట్టుకుని రాత్రంతా నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మకం. ఇక్కడ ఉన్న పాము పుట్ట 88 సంవత్సరాలుగా పూజలు అందుకుంటోంది.

**రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు**

తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 88వ షష్ఠి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమై వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరుగుతాయి. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం, రాత్రి శూలాల సంబరం, చెట్టు భజన, తాడిపెద్దు సంబరం జరుగుతాయి. అనంతరం స్వామి కల్యాణం జరుగుతుంది. 30న మయూర వాహనంపై స్వామి గ్రామోత్సవం, డిసెంబరు 1న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షట్ సహస్ర నామార్చన, రాత్రి అపర్ణ పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం, శ్రీపుష్ప యాగం జరుగుతాయి.




**సుబ్రహ్మణ్యేశ్వరుడే ప్రత్యక్షంగా వెలసిన క్షేత్రం**

## ఆలవెల్లి మల్లవరం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన క్షేత్రమిది. సర్పరూపంలో భక్తులకు దర్శనమిచ్చినచోటే ఆలయాన్ని నిర్మించారు. 1961-64 సంవత్సరాల మధ్య ఆలవెల్లి మల్లవరంలోని పంట పొలాల్లో సర్పం రైతులకు కనిపించింది. కదలకుండా అక్కడే ఉండిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తమకు ప్రత్యక్షంగా కనిపించాడని భావించిన ప్రజలు పూజలు నిర్వహించడంతో అక్కడే ఆలయం నిర్మించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా వెలిశాడనే సమాచారం తెలియడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేవారు. వారి కోసం అప్పట్లో మల్లవరం రైల్వేగేటు వద్ద ప్రత్యేకంగా హాల్టు ఇవ్వడంతో పాటు స్టేషన్ నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వంటి ప్రముఖులు ఈ ఆలయాన్ని సందర్శించారు. సంతాన ప్రాప్తికి, కుజ దోష నివారణకు ఆలయ ఆవరణలో నిద్రిస్తే మంచిదని భక్తులు నమ్ముతారు.



**కార్యక్రమాలు:** వీరచోళ చతుర్వేద మండలం ఆలవెల్లి నిలయ మల్లవరం క్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. బుధవారం ఉదయం స్వామికి అభిషేకాలు, షష్ఠి స్నానాలు, మహా రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి కల్యాణం జరుగుతాయి. 27న స్వామికి క్షీరాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి కోలాటం, 28న స్వామికి మహా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి తెప్పోత్సవం, 29న క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, నెమలి వాహనంపై గ్రామోత్సవం, 30న హనుమత్ పూజ, శ్రీపుష్పయాగం అనంతరం నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. ఈ నెల 27వ తేదీ రాత్రి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సంతాన శయన మందిరాన్ని ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన ప్రవచనం జరుగుతుంది. షష్ఠి ఉత్సవాల్లో భక్తులు అధికంగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని తాటిపర్తి, మల్లవరం ఆలయాల కమిటీల ప్రతినిధులు కోరారు.

# శరణు శరణు సుబ్రహ్మణ్య

**తూర్పు గోదావరి జిల్లా అనపర్తి వీర్రాజుమామిడిలో కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి**

**మాలధారణ చేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు**

(అనపర్తి-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని వీర్రాజుమామిడి వద్ద వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. అనపర్తి నుంచి ద్వారపూడి వైపు వెళ్లే ఎర్ర కాలువ కుడి గట్టుపై వీర్రాజు అనే రైతు మామిడి మొక్క నాటాడు. అది పెరిగి పెద్దదై పదిమందికీ నీడనిస్తూ వీర్రాజు మామిడిగా ప్రసిద్ధి చెందింది. మామిడి మొక్క సమీపంలోనే తేతలి బాపయ్య అనే మరో రైతు రావి మొక్క నాటాడు. అవి రెండూ దినదిన ప్రవర్ధమానమై వృక్షాలుగా మారాయి. అయితే 1970 ప్రాంతంలో అక్కడ వ్యవసాయం నిర్వహించే కొత్తూరుకు చెందిన రైతు చెట్ల తొర్రల్లో పాములు నివాసం ఉండడం గుర్తించి వాటికి పాలుపోయడం ప్రారంభించాడు. తాను పెట్టిన పాలు మరుసటి రోజుకు మాయమవుతుండడంతో.. వాటిని పాములు సేవిస్తున్నాయా, మరో ఇతర జంతువులు తాగుతున్నాయో తెలుసుకునేందుకు అక్కడ కాలువలోని ఇసుకను తీసి పరుపులా పరిచి పరీక్షించాడు. చివరకు ప్రతిరోజూ చెట్టు తొర్రలోకి పాములు వస్తున్నాయని గ్రహించి వాటికి పూజలు ప్రారంభించాడు. నాటి నుంచీ భక్తులు వచ్చి చెట్టు తొర్రలోని నాగేంద్రులకు పాలుపోసి పూజలు చేయడం మొదలుపెట్టారు. 1979లో స్వామివారు ఒక భక్తుడికి కలలో కనిపించిన విధంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ఆలయం అభివృద్ధి చెందుతూ షష్ఠి ఉత్సవాలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

వీర్రాజుమామిడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రతి మంగళవారం ప్రత్యేక పండ్ల రసాలతో ఆలయ అర్చకుడు చందు శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేస్తున్నారు. స్వామివారికి పూజలు చేసి మొక్కుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. విద్య, వివాహం, సంతానం, వ్యాపార అభివృద్ధి మొదలైన కోరికలను స్వామి వారు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



ఇక్కడ ప్రతిఏటా నిర్వహించే షష్ఠి ఉత్సవాల్లో మాలధారణ జరుగుతుంది. 12 సంవత్సరాల క్రితం కోనసీమ జిల్లా ద్వారపూడిలో ఉన్న ఈ ఆచారాన్ని తెలుసుకున్న ఇక్కడి భక్తులు వారి సహాయ సహకారాలతో మాలధారణ గావించి పదకొండు రోజుల దీక్ష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 12ఏళ్ల క్రితం కేవలం 28 మంది భక్తులతో ప్రారంభమైన మాలధారుల సంఖ్య నేడు 278 మందికి చేరుకుంది. అనేక మంది భక్తులు తమ కోరికలు నెరవేరిన వెంటనే వచ్చే షష్ఠి ఉత్సవాల్లో మాల ధరించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉద్యోగం, వివాహం, సంతానం వంటి కోరికలు నెరవేరాయని అనేక మంది భక్తులు చెప్తుంటారు. ఎంతో నియమనిష్టలతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారికి పూజలు చేసి కటిక నేలపై నిద్రిస్తారు.

### సంతానం ప్రసాదించారు

**నల్లమిల్లి నాగార్జునరెడ్డి, పీరా రామచంద్రపురం**



సంతానం కోసం స్వామివారిని మొక్కుకున్నా. ఏడాదికి పుత్రుడు జన్మించాడు. నాటి నుంచి నేటి వరకు ప్రతిఏటా స్వామివారి మాల ధరించి పూజలు చేస్తున్నాను.

### విద్యాభివృద్ధికి మొక్కుకున్నాను

**తేతలి కార్తీక్‌రెడ్డి, అనపర్తి**



విద్యాభివృద్ధి కోసం స్వామివారిని మొక్కుకుని మాల ధరించాను. ఐదేళ్లగా మాలధారణ చేస్తున్నాను. స్వామికి పూజ చేయడం చాలా ఆనందంగా ఉంది.

### స్వామి దయతో ఉద్యోగం సాధించాను

**తమలంపూడి శ్రీసాయిరెడ్డి, అనపర్తి**



ఉద్యోగం కోసం మొక్కుకుని మాల ధారణ చేశాను. స్వామి దయతో సంవత్సరంలోనే మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం సొంతంగా స్టార్టప్ కంపెనీ పెట్టి మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాము. ప్రతిఏటా మాలధారణ చేస్తాను.

# కోరిన కోర్కెలు తీర్చి... సంతానాన్ని ఇచ్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చి సంతానాన్ని ఇచ్చే కొంగు బంగా రంగా బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆరాధిస్తారు. శతాబ్దాల చరిత్ర గల ఈ స్వామి షష్ఠి ఉత్సవాలను సుమారు వందేళ్లుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని, 26న షష్ఠి తీర్థం జరుపుతామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి (వాసు) తెలిపారు.

**ఆలయ చరిత్ర:**

849-892 మధ్య (బిరుదాంకినవోలు) బిక్కవోలును రాజధానిగా చేసుకుని తూర్పు చాళుక్యులు పాలించారు. వీరిలో పెద్దవాడైన విజయాదిత్యుని తండ్రి నరేంద్ర మృగరాజు రాష్ట్ర కూటులతో యుద్ధం చేసి వారిని హతమార్చాడు. 108 యుద్ధాలు చేసి శత్రు సైన్యాలను తరిమికొట్టాడు. అనేక మందిని చంపడంతో హత్యా పాపం పోవడానికి 108 శివాలయాలను నిర్మించాడు. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా ఇక్కడ స్వామి విజయేశ్వరునిగా పేర్గాంచారు. బిక్కవోలు పరిసర ప్రాంతాల్లో నిర్మించిన 108 శివాలయాల్లో కొన్ని తురుష్కుల దాడిలో ధ్వంసం కాగా మరికొన్ని శిథిలమయ్యాయి. తూర్పు చాళుక్యుల చరిత్రకు సాక్ష్యాలుగా బిక్కవోలులో నేటికీ కొన్ని దేవాలయాలు చెక్కుచెదరకుండా వున్నాయి. మూడు ఆలయాలు గ్రామ సరిహద్దుల్లో ఉండగా, క్షేత్ర పాలకునిగా మహావిష్ణువు, లక్ష్మీదేవి ఆలయం వున్నాయి. గ్రామం మధ్యలో రాజరాజేశ్వర, గోలింగేశ్వర, చంద్రశేఖర దేవాలయాలు... మూడు ఒకే ప్రాంగణంలో ఉండడం విశేషం. పెద్దాపురం మహారాజు వత్సవాయి సూర్యనారాయణ తిమ్మ గజపతి గోలింగేశ్వర స్వామి ఆలయంలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాడు. స్వామి పళనిలో వలె దక్షిణాభి ముఖాన దర్శనమిస్తాడు. స్వామి చెంతనే సహజమైన పుట్ట నేటికీ వుంది.



సహజ సిద్ధమైన పుట్టతో దర్శనమిస్తున్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

అందుకే ఈ క్షేత్రానికి కుజ క్షేత్రంగా పేరొచ్చింది. దేశంలోని రెండు దేవాలయాల్లో (బిక్కవోలు, పళని) మాత్రమే కుమారసుబ్రహ్మణ్యస్వామిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సంతానం లేని తిమ్మగజపతి సంతానం కోసం సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించి సంతానం పొందారట. అందుకే షష్ఠి రోజున సంతానార్థులైన స్త్రీలు ఆలయంలోని పుట్టపై నాగుల చీరను వుంచి దానిని ధరించి ఆలయం వెనుక శయనిస్తారు. తద్వారా సంతానప్రాప్తి కలుగు తుందని నమ్మకం.

ఇక్కడ స్వామి దక్షిణాభిముఖంగా వుండడం చేత ఆయనకు ఇష్టమైన మంగళవారం, శుద్ధ షష్ఠి, కృత్తికా నక్షత్రం రోజుల్లో ప్రత్యేక పూజలు, మిగిలిన రోజుల్లో సర్పానికి పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. స్వామికి ఇష్టమైన పర్వదినాల్లో రాహు, కేతు, కుజ, సర్ప దోషాలకు ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు.

బిక్కవోలు పేరు చెప్పగానే అందరికీ గుర్తుకొచ్చేది బాణసంచా. స్థానికంగా తయారీదారులైన గోలింగేశ్వర ఫైర్‌వర్క్స్, కనకదుర్గా హాస్సేనియా ఫైర్‌వర్క్స్ వారు తయారు చేసిన బాణసంచాను షష్ఠి రోజున రాత్రి పది గంటల నుంచి తెల్లవారేవరకు పోటీపడి కాలుస్తారు.

### ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**వాసు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు**



రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన షష్ఠి ఉత్సవాలకు బిక్కవోలుకు లక్ష మందికి పైగా భక్తులు వస్తారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానవాటికలు, బారి కేడ్లు, నాగుల చీరలు ధరించి శయనించే స్త్రీలకోసం ఆలయం వెనుక ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఈ ఏడు ఉత్సవాల నిర్వహణకు రూ.80 లక్షలు వ్యయం చేస్తున్నాం. ఈ నెల 27 నుంచి ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశాము. డిసెంబరు 2న భారీ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి.

# ఇక పిఠాపురం కేంద్రంగా..!

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యకలాపాలు ఇక్కడి నుంచేనా?
- ఇక్కడా జనసేన సెంట్రల్ ఆఫీసు
- పవన్ బస చేసేందుకు వీలుగా ఇల్లు
- మరో 2.63 ఎకరాలు కొనుగోలు
- ఇప్పటివరకూ కొన్నది 20.7 ఎకరాలు



పిఠాపురం పట్టణ శివారులో పవన్‌కల్యాణ్ తాజాగా కొన్న భూమి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఇక్కడ మరిన్ని భూములు కొనుగోలు చేస్తుండడం ఇందుకు బలం చేకూరుస్తోంది. జనసేన సెంట్రల్ ఆఫీసుతోపాటు పవన్ ఉండేందుకు ఇంటిని ఇక్కడ నిర్మించనున్నారు. కార్యకర్తలు ఉండేందుకు, సమావేశాల నిర్వహణకు, అతిథులు వస్తే ఉండేందుకు వీలుగా గెస్ట్‌హౌస్‌లు నిర్మించనున్నట్లు చెప్తున్నారు.

పిఠాపురం పట్టణ శివారులో ఇలింద్రాడ వద్ద గతంలోనే భూములు కొనుగోలుచేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తాజాగా మరిన్ని భూములు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతంలో మరిన్ని పొలాలు కొనేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కోస్తాంధ్ర పరిధిలో రాజకీయ కార్యకలాపాలన్నింటినీ ఇక్కడి నుంచే నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ నిర్మాణాలు జరగనున్నాయి. పిఠాపురంలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హోదాలో తొలిసారి సొంత నియోజకవర్గానికి వచ్చిన ఆయన తాను ఇక పిఠాపురం నివాసినేనని, ఇక్కడ భూములు కొనుగోలుచేశానని ప్రకటించారు. ఇక్కడే ఇల్లు నిర్మించుకుంటానని తెలిపారు. పార్టీ కార్యాలయం నిర్మిస్తానని, కార్యకర్తలు ఉదయం నుంచి రాత్రి వరకూ ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తానని చెప్పుకొచ్చారు. ఇది జరిగి 16నెలలు గడిచాయి.

**మంగళగిరితోపాటు ఇక్కడ**

ప్రస్తుతం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ఉంది. దీని నిర్మాణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. అదే తరహాలో పిఠాపురంలో కొన్న భూముల్లో సెంట్రల్ ఆఫీసు నిర్మాణం చేపట్టనున్నారు. పవన్ ఇక్కడి నుంచే కార్యకలాపాలు చేపట్టేందుకు, సమావేశాల నిర్వహణకు వీలుగా నిర్మాణంఉంటుందని అంటున్నారు. పవన్ నివాసంఉండేందుకు ఇల్లు నిర్మించనున్నారు.ఇక్కడే జనసైనికులు, వీరమహిళలు,నాయకులు ఉండేందుకు నిర్మాణాలు చేపట్టనున్నారు. పవన్ రాకపోకలు సాగించేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తారు. అతిథులకు గెస్ట్‌హౌస్‌లు నిర్మించే అవకాశం ఉంది. ఇప్పటికే ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఈ భూములను పరిశీలించి వెళ్లారు. త్వరలోనే నిర్మాణాల ప్లాన్ రూపొందించి పనులు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఎక్కడెక్కడ కొన్నారంటే..**

పిఠాపురం పట్టణ శివారులో ఇల్లింద్రాడ జంక్షన్ దాటిన తర్వాత గొల్లప్రోలు టోల్‌గేట్‌కు వెళ్లే మార్గంలో తొలుత 3.52 ఎకరాలను కొనుగోలు చేశారు. తదనంతరం మరో విడతలో 14.63 ఎకరాలను కొన్నారు. కొద్దిరోజుల క్రితం జాతీయ రహదారిని చేర్చి ఉన్న 2.63 ఎకరాల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశారు. తాజా కొనుగోలుతో మొత్తం 20.78 ఎకరాలను కొనుగోలు చేసినట్లైంది. ఇవన్నీ ఇల్లింద్రాడ, భోగాపురం గ్రామాల పరిధిలోకి వస్తాయి. పిఠాపురం పట్టణానికి చేర్చి హైవే చెంతనే ఉండడంతో ఇక్కడ ఇల్లు, కార్యాలయాలు నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందనే భావనలో డిప్యూటీ సీఎం పవన్ ఉన్నట్లు చెప్తున్నారు. ఇంకా మరిన్ని భూములు కొనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

**అప్పటివరకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో..**

పార్టీ కార్యాలయం, ఇల్లు నిర్మాణం పూర్తయ్యే వరకూ పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన సమయంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బసచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం గెస్ట్‌హౌస్‌ను ఆధునీకీకరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. పవన్‌కోసం రెండు సూట్‌రూమ్‌లు సిద్ధం చేశారు. సమావేశాల నిర్వహణకు హాలు ఏర్పాటు చేశారు. ఇక నుంచి పిఠాపురం నియోజకవర్గంలో తరచూ పర్యటించేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. మొత్తం మీద పవన్ కార్యకలాపాలకు పిఠాపురం కేంద్రం కానుంది.

# హరోంహర.. శరవణభవ..

- అనపర్తిలో వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం



సంతానం లేని మహిళలపైనుంచి దాటుతూ ఆశీర్వదిస్తున్న కావడి ధరించిన మాలధారులు

అనపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వీర్రాజు మామిడివద్ద కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో షష్ఠి వేడుకల సందర్భంగా సోమవారం కావడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు.ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కావడి భుజాన ఎత్తుకుని ఉత్సవాన్ని ప్రారంభించారు. సంతానంలేని మహిళలు స్వామిని పూజించారు. అనంతరం కావడి ధరించిన మాలధారులు వారిపైనుంచి దాటుతూ వారికి సంతానప్రాప్తి కలగాలని దీవించారు. ఈ సందర్భంగా రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ 279మంది స్వామి మాలధారులు కావడి ధరించి నృత్యాలు చేస్తూ ఉత్సవం నిర్వహించారు. ఇది తమిళనాడులోని పళనిని మరిపించింది. కావడి ధరించిన భక్తులకు మహిళలు పూజలు చేశారు. కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు వోగిరెడ్డి సత్తిరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి,గంగిరెడ్డి,బూరయ్య పర్యవేక్షించారు.

## 8, 9 తేదీల్లో భారతీయ భాషలపై 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాపు



జాతీయ కార్యశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 8,9 తేదీల్లో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరవుతారన్నారు. భారతీయ భాషా సమితి సీనియర్ నిపుణుడు ఆచార్య ఆర్‌ఎస్ సర్రాజు, అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్‌తో పాటు తెలుగు, హిందీ, సంస్కృత భాషా ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భారతీయభాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు నన్నయ అనుబంధ కళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులను, పాఠ్యపుస్తకాలు రచించిన విద్యావేత్తలను, భాషాభిమానులను ఆహ్వానిస్తున్నామన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ తలారి వాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాకినాడలో లక్కీ షాపింగ్ మాల్ 14వ షోరూమ్ ప్రారంభం



షాపింగ్‌మాల్‌లో కొత్తచీరతో సినీనటి ప్రియాంక మోహన్



వేదికపై హైపర్ ఆది సందడి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నటి అనసూయ

కాకినాడ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్‌లో లక్కీషాపింగ్ మాల్ 14వషోరూమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోయిన్, ఓజీ ఫేం ప్రియాంక మోహన్, ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్, హాస్యనటుడు హైపర్ ఆది విచ్చేసి సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. షాపింగ్ మాల్ అధినేతలు రత్తయ్య, శ్రీనివాస్, స్వాములు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో ఫ్యామిలీ కలెక్షన్స్‌లో తిరుగులేని ఆదరణ పొందిన లక్కీ షాపింగ్ మాల్ కాకినాడలో 14వ షోరూమ్‌ను ప్రారంభించిందన్నారు. నమ్మకమైన నాణ్యత, అందుబాటు ధరలు, ట్రెండీ కలెక్షన్లు నిండిన లక్కీ షాపింగ్ మాల్‌లో బడ్జెట్ ధరల్లో వస్త్రాలను అందించనున్నామన్నారు. 30ఏళ్ల నమ్మకమైన వ్యాపార ప్రయాణంలో కొత్తమైలురాయిని చేరుకుందన్నారు. నాలుగు అంతస్తుల విశాల భవనంలో ముస్తాబైన ఈ కొత్త మాల్ కాకినాడ ఫ్యాషన్ లైఫ్ స్టైల్‌కు కొత్త నిర్వచనం ఇవ్వనుందన్నారు. ఎత్నిక్‌వేర్‌నుంచి ఆధునిక వెస్ట్రన్ స్టైల్స్ వరకు అందుబాటు ధరల్లో ఉంచామన్నారు. నాయకులు గ్రంధి బాబ్జీ, బచ్చు శేఖర్, సంగిశెట్టి అశోక్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన యువతీ, యువకులు, మహిళలు సినీ తారలతో సెల్ఫీలు దిగారు.



## ముగిసిన జూడో పోటీలు

**ఓవరాల్ చాంపియన్స్ కాకినాడ జట్టు**

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జూడో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజులు జరిగిన జూడో సీనియర్స్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కాకినాడ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. రెండో స్థానంలో తూర్పు గోదావరి జట్టు, ఉమెన్ కేటగిరీలో రెండో స్థానంలో కాకినాడ జిల్లా జట్టు నిలిచాయి. విజేతలకు జూడో సంఘం రాష్ట్ర సీఈవో వెంకట్, కాకినాడ చైర్మన్ వెలగ వెంకటకృష్ణారావు, కాకినాడ జిల్లా కోశాధికారి రమణ, డీఎస్ఏ కోచ్ తేజ బహుమతులు అందజేశారు. వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల బాలుర ఖోఖో పోటీలు

- విజేతగా ప్రకాశం జిల్లా జట్టు
- ద్వితీయ, తృతీయస్థానాల్లో చిత్తూరు, విశాఖ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్యఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈనెల 22నుంచి జరిగిన అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలుర ఖోఖో పోటీలు సోమవారం ముగిశాయి. ప్రకాశం జట్టు(ప్రథమ), చిత్తూరు జట్టు(ద్వితీయ), విశాఖ జట్టు(తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీఎస్డీవో సతీష్‌కుమార్, ఖోఖో సంఘ అధ్యక్షుడు పట్టాభి, మాచరరావు, సురేష్ రాజు, మాజీ కార్యదర్శి జార్జి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రాష్ట్ర జట్టు:** బి.తిరుమల, పి.నవీన్, పి.వెంకటేశ్వర్లు, జి.చంద్రు, వై.యశ్వంత్, సీహెచ్‌డీ ప్రసాద్, ఎంవీపీ రెడ్డి, హెచ్‌వీడీ హనుమంతు, ఐ.రోహిత్, ఆర్.బాలాజీ, ఎన్.లక్ష్మణ్, టీఎస్ సాయిమణికంఠ, స్టాండ్‌బైలుగా జి.లక్ష్మీప్రసాద్, ఎ.జయంత్, జె.ఇల్లప్ప, జీడీ భాస్కర్, డి.రాజు.



ప్రకాశం జిల్లా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

# సత్యదేవుడి కార్తీకమాస ఆదాయం రూ.21.75 కోట్లు


భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

**తగ్గిన వ్రతాల సంఖ్య**
**పెరిగిన ఆదాయం**
**వెల్లడించిన ఈవో సుబ్బారావు**

అన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఈ ఏడాది కార్తీకమాసంలో అన్ని విభాగాల ద్వారా రూ.21,75,95,167 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలను వెల్లడించారు. సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసంలో విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను రెండోవిడత సోమవారం లెక్కించారు. రూ.1,77,73,072 నగదు, 43 గ్రాముల బంగారం, 978 గ్రాముల వెండి సమకూరాయి. అయితే వీటితో కలిపి కార్తీకమాసంలో మొత్తంగా రూ.21,75,95,167 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. గతేడాది కార్తీకమాసంతో పోలిస్తే ఈ ఏడాది కార్తీకంలో వ్రతాల సంఖ్య 12,666 తగ్గగా అన్ని విభాగాల ఆదాయం నుంచి గతేడాది కంటే రూ.62,13,099 పెరిగిందన్నారు. వీటిలో ప్రధానంగా వ్రతం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.7.81 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 4.57 కోట్లు, హుండీలలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.51 కోట్లు, సత్రంగదుల అద్దెల ద్వారా రూ.1.23 కోట్లు ఆదాయం లభించింది. మొత్తం 15 విభాగాల నుంచి ఈ ఆదాయం సమకూరింది. మిగిలిన విభాగాల ఆదాయాలను పరిశీలిస్తే కల్యాణమండపాల ద్వారా రూ.6.18 లక్షలు, స్వామివారి నిత్యకల్యాణాల నుంచి రూ.7.52 లక్షలు, ఆర్జితసేవల ద్వారా రూ. 9.63 లక్షలు, ఏసీ వ్రతాల నిర్వహణ ద్వారా రూ.61.56 లక్షలు, రవాణా విభాగం రూ. 38.39 లక్షలు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.89. 60 లక్షలు సమకూరాయని వెల్లడించారు.

### తుఫాను వల్ల తగ్గిన వ్రతాలు

వ్రతాలసంఖ్య తగ్గడానికి మొంథా తుఫాను కారణమన్నారు. ఈ ఏడాది కార్తీకంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది సమష్టిగా కష్టపడి పనిచేశారన్నారు. చైర్మన్ రోహిత్ నిరంతరం పర్యవేక్షణతో సత్ఫలితాలు సాధించామన్నారు. దేవదాయశాఖ ప్రత్యేక అధికారిగా రీజినల్ జాయింట్ కమిషనర్ వేండ్ర త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్లు రమేష్‌బాబు, సూర్యచక్రధరరావు, విశ్వనాధరాజును నియమించి వారి సలహాలు, సూచనలు పర్యవేక్షణలతో అంతా సవ్యంగా జరిగిందన్నారు. ఇదిలా ఉండగా గతేడాది కంటే కార్తీకమాసం ఆదాయం పెరగడానికి లీజుల నుంచి గతంలో రూ.1.09 కోట్లు వసూలుకాగా ఈ ఏడాది కార్తీకంలో రూ.2.27 కోట్లు వసూలు కావడం, గతేడాది ఆదాయంలో హుండీల కానుకలు 32 రోజులుకు చూపించగా ఈఏడాది కార్తీక ఆదాయంలో హుండీ ఆదాయం 49రోజుల ఆదాయం చూపడంతో ఆదాయం పెరిగినట్టు ఈవో వెల్లడించారు. కార్తీకంలో ఇంజనీరింగ్ సివిల్ పనులకు రూ. 81.88 లక్షలు, విద్యుత్ విభాగం నుంచి రూ.20లక్షలు వ్యయం చేశారన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బాబూరావు, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.70.11 లక్షలు

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన శ్రీఅంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని కార్తీకమాసంలో లక్షలాది మంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు ప్రత్యేక దర్శనాలు, ప్రసాదాలు, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.37,99,038 ఆదాయం రాగా స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు ద్వారా రూ.32,12,352 ఆదాయం వచ్చింది. మొత్తంగా రూ.70,11,390 ఆదాయం వచ్చిందని ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. నిత్యాన్నదానంలో 86వేల మంది భక్తులు నెల రోజుల పాటు స్వామివారి ప్రసాదం స్వీకరించారని తెలిపారు. స్వామివారి ఆలయానికి చేరుకునేందుకు ప్రధాన మార్గమైన చించినాడ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా రాకపోకలు నిలుపుదల చేయడం, మొంథా తుఫాన్ కారనంగా గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఆదాయం స్వల్పంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక


యాళ్ల నరసింహస్వామి

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థి యాళ్ల నరసింహస్వామి స్వర్ణ పతకం సాధించాడు. డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. స్వామిని స్కూలు ప్రిన్సిపాల్ నంధ్యాల మనువిహార్ అభినందించారు.

## మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి

**గుండెపోటుతో చుండ్రు శ్రీవరప్రకాష్ కన్నుమూత**
**ఇంటికి తరలివచ్చిన నాయకులు, వ్యాపారవేత్తలు**



ప్రకాష్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల, అమలాపురం ఎంపీ హరీష్

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన టీడీపీ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (51) గుండెపోటుతో ఆదివారం రాత్రి అకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి గతంలో అనారోగ్యంతో మరణించగా, ఆయన మాతృమూర్తి అనంతలక్ష్మి(అమ్ములు) ఏడాది కిందట కన్నుమూశారు. ఆయన కుమారుడు కిరీటి యూఎస్‌లో చదువుతుండగా ఆయన కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. ప్రకాష్‌కు సేవాతత్పరుడిగా పట్టణంలో మంచిపేరు ఉంది. ఆదివారం రోజంతా పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన రాత్రి ఇంటికి చేరిన తర్వాత ఆరోగ్యం నలతగా అనిపించడంతో సమీపంలో ఆర్ఎంపీని పిలిపించుకున్నారు. తర్వాత మందులు వేసుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఒక్కసారి గుండెపోటుతోపాటు బీపీ అధికం కావడంతో ఆయనను ఇంటి వద్ద నుంచి హుటాహుటిన మండపేటలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన కన్నుమూశారని వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మరణ వార్త పట్టణమంతా వ్యాపించటంతో పార్టీ శ్రేణులు, హితులు కేపీ రోడ్డులో దాసిరెడ్డి వారి వీధిలో ఉన్న ఇంటికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని ఇంటి వద్ద ఉంచారు. ఆయన కూమారుడు అమెరికా నుంచి వచ్చిన తర్వాత మంగళవారం అంత్యక్రియలను నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాగా ప్రకాష్ మృతితో ఆయన కుటుంబంతోపాటు టీడీపీలో విషాదచాయలు అలుముకున్నాయి. మండపేట మున్సిపల్ చైర్మన్‌గా 2014-2019 మధ్య పనిచేసిన ప్రకాష్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు శానిటేషన్ విషయంలో పలు అవార్డులు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అన్నివిధాలా పార్టీ వ్యవహారాల్లో వెన్నుదన్నుగా నిలిచేవారు. ప్రస్తుతం మండపేటలో టీడీపీ వ్యవహారాల ఇన్‌చార్జిగానూ ఉన్నారు.

### తీరనిలోటు : మంత్రి సుభాష్

విద్యావంతుడు రాజకీయనేత్త, వ్యాపారవేత్త, సామాజిక సేవా తత్పరుడిగా చుండ్రు శ్రీవరప్రకాష్ అతిపిన్న వయస్సులోనే గుండెపోటుకు గురై మరణించడం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి కుటుంబానికి తీరని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండపేటలో ప్రకాష్ స్వగృహానికి మంత్రి చేరుకుని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రకాష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అమలాపురం ఎంపీ జీఎం హరీష్‌మాధుర్, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

### మండపేటలో దుకాణాలు బంద్

చుండ్రు శ్రీవరప్రకాష్ ఆకస్మిక మరణంతో మండపేట పట్టణంలో చాంబర్ ఆఫ్ కామర్స్ పిలుపు మేరకు సోమవారం వ్యాపార సంస్థలు మూసివేశారు. అలాగే మంగళవారం పట్టణంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలను ప్రకాష్ మృతికి సంతాపంగా మూసివేస్తున్నామని ప్రైవేటు పాఠశాల యాజమాన్యల సంఘప్రతినిధులు సోమవారం ప్రకటించారు.

## మోరిలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

**13 జిల్లాల నుంచి పాల్గొన్న 312 మంది విద్యార్థులు**


ఫెన్సింగ్ పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దేవ..


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే దేవ, డీఈవో

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్ (ఎస్‌జీఎఫ్ అండర్-17) పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి అతిథులు, విద్యార్థులు ఆహ్వానం పలికారు. జాతీయ జెండా వందనం అనంతరం జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే, డీఈవో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలు మోరి హైస్కూలులో జరగడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రభుత్వం క్రీడల్లో తగిన విధంగా ప్రోత్సహిస్తుందని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి నెలకొల్పాలని డీఈవో సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 312 మంది విద్యార్థులు పాల్గొనేందుకు విచ్చేశారు. జిల్లాకు 12 మంది బాలలు, 12 మంది బాలికలు చొప్పున 24 మంది వ్యక్తిగతంగా గ్రూప్ పోటీల్లో పాల్గొన్నారు. ఫెన్సింగ్ క్రీడలో 3 విభాగాలైన పాయల్, షాబర్, ఈపీలలో విజేతలైన మొదటి నాలుగు స్థానాలు సాధించిన 24 మందిని ఎంపిక చేసి డిసెంబరు 28, 29, 30 తేదీల్లో మహారాష్ట్రలోని శివాజీ షంభాజీ నగర్‌లో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ కడలి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, మోరిహైస్కూలు హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి

**కారకులెవరనేది ప్రభుత్వానికి నివేదిస్తాం**
**జీజీహెచ్ ఘటనపై విచారణ చేపట్టిన డీఎంఈ రఘునందన్**


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఇటీవల 8వ నెల గర్భిణితో పాటు ఆమె కడుపులో బిడ్డ కూడా మృతిచెందడంపై రాష్ట్ర డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ సోమవారం విచారణ నిర్వహించారు. నిర్లక్ష్యం కారణంగానే గర్భిణి మృతిచెందిందని ప్రాథమికంగా నిర్ధారించామని, అయితే నిర్లక్ష్యానికి కారకులెవరనేది ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంఈ పేర్కొన్నారు. ఈ విచారణ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు గైనకాలజీ సెమినార్ హాల్లో జరిగింది. డీఎంఈతో పాటు ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరీ, డీఎం హెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ హాజరయ్యారు. గైనిక్ విభాగంలోని యాంటీనేటల్, జీబీసీయూ వార్డుల్లోని వైద్యుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరిని విచారించారు. కొంతమంది నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. సేకరించిన నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంఈ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆసుపత్రిలో పలు అంశాలపై విషయాలను డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ వ్యవహార శైలిని తీవ్రంగా ఆక్షేపించారు. ఇటువంటి దారుణ పరిస్థితులు జీజీహెచ్‌లో తలెత్తుతున్నా నిమ్మకు నీరెత్తుతున్నట్లు వ్యవహరిస్తున్నారని తగిన పర్యవేక్షణ ఉండడం లేదని డీఎంఈకి ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో మృతురాలి మల్లేశ్వరీ కుటుంబీకులు ఆమె 5 ఏళ్ల కుమార్తెతో కలిసి గైనిక్ విభాగం బయట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీఎంఈ ఆందోళనకారులను విచారణ జరిగే ప్రాంతానికి పిలిపించారు. మృతురాలి సోదరి, వదిన నుంచి కూడా వివరణతో కూడిన స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. విచారణలో గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ ఉన్నారు.


ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు ప్రథమం



రగ్బీ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. కర్నూలులో ఈనెల 23, 24 తేదీల్లో స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాలు నుంచి బాలికల జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు విశేష ప్రతిభ కనబరచి మొదటిస్థానం సాధించింది. జిల్లా బాలికల జట్టుకు కోచ్, మేనేజర్లుగా పీడీలు శేషకుమారి, కె.నాగలింగేశ్వరరావు వ్యవహరించినట్టు రగ్బీ ఉమ్మడి జిల్లా కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. విజేతగా నిలిచిన బాలికల జట్టు సభ్యులు, కోచ్ లక్ష్మణరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వెంకటరెడ్డి, ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.దొరబాబు, చైర్మన్ వియ్యపు రామన్నరాజు అభినందించారు.

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లకు ద్వితీయస్థానం

ఐ.పోలవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ఈనెల 22 నుంచి 24వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇరు జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో జి.వేమవరం జడ్పీ హైస్కూల్ చెందిన ఆరుగురు బాలురు, ఏడుగురు బాలికలు జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. బాలుర విభాగం నుంచి ఎం.బాబు, మద్దింశెట్టి బాల ఆదిత్య ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం.ఝాన్సీ బెస్ట్ క్యాచర్ అవార్డు అందుకుంది. విజేతలు, కోచింగ్ మేనేజర్ అడ్డగాళ్ళ నాగరాంప్రసాద్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం వారణాసి సుబ్రహ్మలక్ష్మీదేవి, సర్పంచ్‌లు నల్లా సుదర్శన్‌రావు, లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు తదితరులు అభినందించారు.


సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన బాలురు, బాలికల జట్ల సభ్యులు



## రైలు ఢీకొని వ్యక్తి మృతి


సత్యనారాయణ (ఫైల్)

బిక్కవోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన బేరా సత్యనారాయణ (57) తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని తుమ్మలపల్లి రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతూ గూడ్స రైలు ఢీకొని మృతి చెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ బిక్కవోలులో లింగాల చెరువు వద్ద పనిచేస్తుంటాడు. అతడికి పుట్టుకతోనే పోలియో వల్ల కాలు, చేయి పడిపోయాయి. ఉదయం రైల్వేగేటు వద్ద బహిర్భూమికని రైలు పట్టాలు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో శరీరం రెండుగా విడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసామని ఎస్ఐ వివరించారు.

## మండపేటలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కలువపువ్వు సెంటర్‌లో సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. సెంటర్‌లో ఉన్న అమ్మవారి ఆలయం చెంతనే ఉన్న సిమెంట్ బల్ల వద్ద 70 ఏళ్ల వృద్ధుడు మరణించాడు. మృతదేహంపై నీలం రంగు లుంగీ, వంగపువ్వురంగు తెలుపు పచ్చగీతలు గల టీషర్ట్ ఉన్నాయి. వివరాలకు మండపేట సీఐ సురేష్‌ను 9440796591లో సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


గొల్లప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఆదివారం గొల్లప్రోలు బైపాస్ 216వ జాతీయ రహదారి కూడలి వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, మోటారు సైకిళ్ల ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉండ్రు కృష్ణారావు అలియాస్ రాజు (40) అక్కడికక్కడే మరణించగా, పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉంటున్న గంధం శ్రీను (40)కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనును తొలుత పిఠాపురం సీహెచ్‌సీకి అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్టు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వివరించారు.

## ముగ్గురు మోటారుసైకిళ్ల దొంగల అరెస్ట్

**ఆరు మోటారుసైకిళ్లు స్వాధీనం**
**నగరం ఎస్ఐ చైతన్యకుమార్ వెల్లడి**

మామిడికుదురు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 6 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన నాగళ్ల అరవింద్, మరో ఇద్దరు బాల నేరస్తులు రెండు మోటారు సైకిళ్లపై శివకోడు నుంచి కాకినాడ వైపు వెళ్తున్నారు. గెద్దాడ హైవేలో వాహనాలు తనిఖీ చేస్తున్న నగరం పోలీసులు ఆ ముగ్గురిపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ప్రశ్నించగా నగరం పోలీసుస్టేషన్‌లో నమోదైన 3 మోటారుసైకిళ్లు, రాజోలు, మలికిపురం, పాలకొల్లు పోలీసుస్టేషన్లలో చోరీ అయిన మరో 3 వాహనాలు కలిపి 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టినట్టు ఎస్ఐ తెలిపారు. వారిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ భీమరాజు, ఎస్ఐ చైతన్యకుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## శతాధిక వృద్ధురాలి మృతి



కొత్తపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెనికి చెందిన గొలకోటి ఆదిలక్ష్మి(110) సోమవారం ఇంటి వద్ద వయోభారంతో మృతిచెందింది. ఆమెకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 20 మంది మనవలు, 20 మంది మునిమనవలు, నలుగురు అనుమనవలు ఉన్నట్టు కుటుంబసభ్యులు చెప్పారు.

## తుమ్మలపల్లిలో పేలిన రిఫ్రిజిరేటర్

**రూ.5లక్షల ఆస్తి నష్టం**


దగ్ధమైన రిఫ్రిజిరేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి

అల్లవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లిలో ఆదివారం రాత్రి కాట్రు రామకృష్ణ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ పేలిపోయింది. ఇల్లు కూడా పాక్షికంగా ధ్వంసమైంది. ఏసీ, మోటారుసైకిల్, మంచాలు, వంట సామగ్రి కాలిపోయి రూ.5లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాద స్థలిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, అమలాపురం అసెంబ్లీ వైసీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎంపీపీ యిళ్ల శేషారావు, కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, కె.శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్ పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

## అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కొప్పిశెట్టి తులసినాగతేజస్వి ని కుటుంబ సమేతంగా సోమవారం అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.20,112 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు.

## వీరేశ్వరస్వామిని దర్శించుకున్న సినీ నటుడు దిల్‌రమేష్



ఐ.పోలవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా షూటింగ్ పర్యటనలో ఉన్న ప్రముఖ సినీనటుడు దిల్‌రమేష్ సోమవారం మురమళ్ళ వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఇరుకు గదుల్లో హైస్కూల్ విద్యార్థుల ఇక్కట్లు

- నిలిచిన అదనపు గదుల నిర్మాణం
- వరండాల్లోనే చదువులు



వాసాలతిప్ప స్కూల్లో వరండాలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరాన ఉన్న వాసాలతిప్ప పాఠశాల విద్యార్థులు కూర్చునేందుకు జాగా లేక ఇరుకు గదుల్లో ఇక్కట్లు పడుతున్నారు. టి.చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప తీరప్రాంత గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాల భవనం లోతట్టున ఉండి నీరు చేరడంతో పనికి రాకుండా పోయింది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల తరగతులను ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 102మంది, ఉన్నత పాఠశాలలో 123మంది విద్యార్థులు ఉన్నారు. అయితే వీరందరికి రెండు భవనాల్లో నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో నలుగురు, ఉన్నత పాఠశాలలో 9మంది ఉపాధ్యాయులున్నారు. వరండాల్లో సైతం తరగతులు నడుస్తున్నాయి. పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ప్రధానంగా టెన్త్ విద్యార్థులకు విద్యాబోధనలో ఉపాధ్యాయులు నానా హైరానా పడుతున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.52లక్షలు మంజూరయ్యాయి. సిమెంట్‌కు ఆ నిధులు ఉపయోగించకూడదని నిబంధన ఉంది. కొంత పని అయిన తర్వాత సిమెంట్‌ను సంబంధిత కాంట్రాక్టర్ సరఫరా చేయక పోవడంతో పిల్లర్ల దశలో నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వంలో సిమెంట్‌ను ఆ నిధుల నుంచి కొనుగోలు చేయవచ్చని వెసులుబాటు కల్పించిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఎంఈవో సత్తి సత్యకృష్ణ తెలిపారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



బందారులంకలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను తీసుకుని ముందుకు సాగుతుందన్నారు. బందారులంకలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, సర్పంచ్ పెనుమాల సునీత, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, మాడా మాధవి, మాకే రమణ, బండి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సమనసలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పరమట చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాల్లో సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్, మాజీఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు సత్తి రామచంద్రరావు, సరెళ్ల సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓఎన్జీసీ నష్టపరిహారానికి ప్రజల ఆందోళన



ఆందోళకారులతో మాట్లాడుతున్న పుదుచ్చేరి కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

యానాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చమురు సంస్థల కార్యకలాపాలతో నష్టపోయిన తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న నాలుగు గ్రామాల ప్రజలతో పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్ చర్చించారు. ముందుగా ఈఅంశాలపై కాకినాడ కలెక్టర్ హన్‌మోహన్ అధ్యక్షతన కాకినాడలో జరిగిన సమావేశంలో ఓఎన్జీసీ ఈడీ ప్రబల్ సేన్‌గుప్తా, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పుదుచ్చేరి కలెక్టర్ కులోంగత్తన్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్యాస్ పైప్‌లైన్‌కు సంబంధించిన అంశాలను చర్చించారు. అనంతరం ఉదయం యానాం శివారు దొమ్మేటిపేట, బాలయోగికాలనీ, దరియాలతిప్ప, సీతారాంనగర్ గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన శిబిరం వద్దకు కలెక్టర్, అధికారులు వెళ్లారు. అనంతరం వారితో డిమాండ్లపై చర్చించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామానికి ఇద్దరు చొప్పున ప్రతినిధులతో పరిపాలనాధికారి కార్యాలయంలో మరోసారి సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఓఎన్జీసీ అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అయినా ఇరువురి మధ్య చర్చలు కొలిక్కి రాలేదు.

## పంచ సూత్ర ప్రణాళికతో లాభసాటి వ్యవసాయం

ఉప్పలగుప్తం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పంచసూత్ర ప్రణాళికతో వ్యవసాయాన్ని లాభాల బాటలో నడిపించుకోవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను సాకారం చేసేందుకు రైతులంతా నడుంబిగించాలని రైతు నాయకుడు, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తంలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతన్నా! మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పంచసూత్ర ప్రణాళిక కరపత్రాలను రైతులు ఆవిష్కరించారు, మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గొల్లవిల్లి నీటి సంఘం అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, రైతు నాయకులు అడబాల సత్యనారాయణ, మద్దింశెట్టి సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు. భీమనపల్లిలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆకేటి పెద్ద, కోలపల్లి భగవాన్, సొసైటీ సీఈవో పోలిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నా మీకోసం.. ప్రారంభం



మామిడికుదురులో కరపత్రాలు అందిస్తున్న తహశీల్దార్, ఎంపీడీవో

మామిడికుదురు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్నా మీకోసం కార్యక్రమం ప్రారంభించామని మండల వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ తెలియచేశారు. మామిడికుదురులో సోమవారం జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో జి.భవానీ పాల్గొని ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అమలుచేస్తున్న పలు పథకాల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రభుత్వం రైతుల కోసం అమలుచేస్తున్న పథకాలను వ్యవసాయశాఖ సిబ్బంది వివరించడమే ఈ పథక ముఖ్యఉద్దేశమని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఏఈవో ఆర్.శివరామకృష్ణ, వీఏఏ బీఎస్‌సీశేఖర్, వీఆర్వోలు త్రిమూర్తులు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయండి



ధర్నా చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

అమలాపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ తక్షణం అమలు చేయడంతో పాటు ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో సమగ్రశిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురం నల్లవంతెన వద్ద ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచినా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఆరోపించారు. ఈపీఎఫ్, ఆరోగ్య బీమా, మెడికల్ సదుపాయాలు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని జేఏసీ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు, కార్యదర్శి బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టీచర్స్ డీఎస్సీ సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికై డిసెంబరు 10న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నా శిబిరంలో జేఏసీ ఉపాధ్యక్షుడు వి.జాన్‌బాబు, కోశాధికారి వి.వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి కె.గౌతమ్ ప్రసాద్, ఎస్కే రహ్మాన్, ఎం.అనూష, గూటం నాగన్న, మెండు శ్రీనుబాబు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు ఏర్పాట్లు



శివకోడులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల26న రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో శివకోడులో పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం పర్యవేక్షించారు. ఎమ్మెల్యే దేవ పర్యవేక్షణలో అధికారులు, నాయకులు సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. పవన్ పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే దేవ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, అడబాల యుగంధర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏవో ఎంవీ సత్యనారాయణ, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్ తదితరులుపాల్గొన్నారు.

## టీడీపీ నాయకుల సమీక్ష

మలికిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో ఈనెల26న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. మోరిలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివకోటిలో ఫ్లెక్సీల ఏర్పాటు, స్వాగత సత్కారాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి తొలిసారిగా రాజోలు నియోజకవర్గం వస్తున్న సందర్భంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆయనకు భారీగా స్వాగతం పలకాలన్నారు. తీరప్రాంతంలో పన్నెండు గ్రామాల రైతుల బాధలను పరిష్కరించడానికి ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్, చాగంటి స్వామి, మంగెన నాని, అడబాల విజయ్, కడలి మోహన్, కడలి వెంకటరత్నం పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు పరిశీలన

యానాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తంగన్ పరిశీలించారు. అక్కడ హెచ్‌ఆర్ స్వేర్ సంస్థ చేస్తున్న కార్యకలాపాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులో వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

రాజోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజోలు రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని పొన్నమండ ప్రధానోపాధ్యాయుడు కె.హనుమంతరావు అన్నారు. పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రాజోలు రోటరీ క్లబ్ ఆర్థిక సాయంతో 30కొబ్బరి మొక్కలను క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి ఆంజనేయులు నాటారని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ నామన షణ్ముకం, దార్ల పెదబాబు, చిట్నీడి లక్ష్మణరావు, నార్కేడుమిల్లి బాలకృష్ణ, కసుకుర్తి రామకృష్ణ, లక్కింశెట్టి శ్రీబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుండలేశ్వరునికి వెండి శంఖం బహూకరణ



కాట్రేనికోన, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భీమనపల్లికి చెందిన దేశంశెట్టి గోపీనాథ్‌బెనర్జీ, సత్యవాణి దంపతులు కుండలేశ్వరస్వామికి సోమవారం 500గ్రాముల వెండి శంఖాన్ని బహూకరించారు. కుండలేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, బీమాల సూర్యనాయుడు, సలాది సాయిచరణ్, దేశంశెట్టి కాళిదాస్‌బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

పి.గన్నవరం,నవంబరు 24(ఆంధ్ర జ్యోతి): నాగుల్లంక వృద్ధాశ్రమంలో సోమవారం మమతా స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కాకినాడలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుసుమ మునిప్రసాద్ సౌజన్యంతో 25మంది వృద్ధులకు దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పాలూరి ఫణి, నల్లా పెద్దకాపు, కొమ్మూరి మల్లిబాబు, యల్లమిల్లి చిట్టిబాబు, ఎన్.సందీప్, మంగం శ్రీనివాస్, ప్రమీల విజయకుమార్ పాల్గొన్నారు.

# పశువుల దాణాను ఉపయోగించుకోవాలి



పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్కువ ధరకు అందిస్తున్న పశువుల దాణాను పాడి రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. నగరం పీఏసీఎస్ కార్యాలయం వద్ద పశువుల దాణా అమ్మకాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. సొసైటీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యాష్ కౌంటర్, కంప్యూటర్ డెస్కులను ప్రారంభించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన 15 రకాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, పశుసంవర్ధకశాఖ అధికారి జె.వెంకట్రావు, తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో జి.భవానీ, సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, నాయకులు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, మద్దాల కృష్ణమూర్తి, వర్థినేని బాబ్జి, బైరిశెట్టి దుర్గారామకృష్ణ, సొసైటీ చైర్మన్లు మందా గాంధీ, అప్పన వీరబాబు, సొసైటీ సీఈవో అడబాల పెద్దిరాజు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదులో యానాం ఫస్ట్

యానాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇన్సిటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నమోదులో యానాం నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచింది. పుదుచ్చేరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వాటికి సంబంధించిన అంశాలను సీఈవో జవహర్ వివరించారు. పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా 10.21లక్షల ఓటర్లు ఉన్నారని, వాటిలో 9,76,747 మంది ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు అందజేయడంతో పాటు ఇప్పటివరకు 5,89,075మంది ఓటర్లు ఫారాలను డిజిటలైజేషన్ చేయడంతో 57.66 శాతం నమోదు చేసుకుందన్నారు. పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాంలో 962మంది బీఎల్‌వో, 30ఏఈఆర్‌ఓ, 17మంది ఈఆర్‌వో, 2 డీఈవోలతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 2300మంది బూత్‌లెవిల్ ఏజెంట్లను నియమించి ఈప్రక్రియను వేగవంతం చేశామన్నారు. 30 నియోజకవర్గాల్లో యానాంలో ఇప్పటివరకు 40,043మంది ఓటర్లకు 28,559మంది ఓటర్ల వివరాలను ఎస్ఐఆర్‌లో డిజిటలైజేషన్ చేయడంతో 71.32శాతం నమోదుతో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఓటర్లు తమ ఫారాలను డిసెంబర్ 4వతేదీలోగా ఇవ్వాలన్నారు. డిసెంబరు 9న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రచురిస్తామన్నారు. నియోజకవర్గాల వారీగా ప్రతిభ సాధించిన బూత్‌లెవిల్ అధికారులను సీఈవో అభినందించారు.

## వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడొద్దు



అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌ఆచార్యతో పాటు విద్యార్థులు

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిపుణులైన వైద్యుల సలహాలు లేకుండా యాంటీ బయాటిక్ మందుల వాడడం వల్ల భవిష్యత్తులో దుష్పరిణామాలు ఎదురవుతాయని కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ఈనెల18 నుంచి 24వరకు యాంటీ బయాటిక్ మందుల వాడకంపై అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఆనంద్‌ఆచార్య మాట్లాడుతూ వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్ మందులు వాడడం వల్ల భవిష్యత్తులో చికిత్సకు అసాధ్యమయ్యే పరిస్థితి ఎదురవుతుందన్నారు. మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మజ మాట్లాడుతూ చిన్నచిన్న వ్యాధులకు సైతం యాంటీబయాటిక్స్ వాడడం వల్ల భవిష్యత్తులో ఆ మందుల పనిచేయడం మానేస్తాయని వివరించారు. యాంటీ బయాటిక్ మందులను సరైన పద్ధతిలో వాడాలంటూ వైద్య విద్యార్థులతో కలసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్‌వర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు, వసంత్, మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ సలాం, డాక్టర్ వరదా, డాక్టర్ శరణ్య పాల్గొన్నారు.

## నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకృష్ణేశ్వర శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి 1.45 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణం జరుగుతుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాస్, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణానికి విస్తృతఏర్పాట్లు చేశారు. ఆలయం ఎదుట ఉన్న శ్రీయేడిది సత్యనారాయణ కల్యాణ మండపంలో స్వామి కల్యాణం జరుగుతుంది. దేవదాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం షష్ఠి తీర్థానికి భారీ ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం చైర్మన్ పేరూరి విజయలక్ష్మి, దేవదాయశాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బారీకేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

## రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

అల్లవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఈనెల26న జరిగే 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ దళిత నాయకుల సమావేశం పిలుపునిచ్చింది. సోమవారం దేవగుప్తంలో జరిగిన సమావేశంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు, బీఎస్పీ నాయకుడు జిత్తుక సత్యనారాయణ, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, సాపే రమేష్, దాకారపు మహేష్, పెనుమాల రాహుల్, కాశి బాలయోగి, పెనుమాల విక్రమ్, రొక్కాల బాబ్జి, పులిదిండి సత్యనారాయణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

అంబాజీపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భవానీ, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి మాల ధరించి దీక్ష చేపట్టే భక్తులకు ఆధ్యాత్మిక చింతనతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలోని డీకే గార్డెన్స్‌లో భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భవానీల అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, వాసంశెట్టి కుమార్, దొమ్మేటి సాయికృష్ణ, రవణం రాము, కొప్పినీడి ఈశ్వరరావు, దొమ్మేటి రామారావు, భవానీసేవా సమితిసభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అంబాజీపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని గుడాలవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో సర్వశిక్షాభియాన్ నిధులు రూ.20లక్షలతో నిర్మించే ప్రహరీ నిర్మాణానికి సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గుడాల ఫణి, గుబ్బల నాగవెంకటరమణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన

మామిడికుదురు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా 60మంది విద్యార్థుల బృందం ఇండస్ట్రియల్ సందర్శన కోసం అమలాపురం వెళ్లారు. మామిడికుదురు జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులో భాగంగా ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు ఆధ్వర్యంలో అమలాపురంలోని వివిధ రకాల షోరూమ్స్ సందర్శించారు. అక్కడ వినియోగదారులతో మాట్లాడే విధానం, క్రయవిక్రయాలు, అమ్మకాలు, సిబ్బంది పనితీరు, వినియోగదారులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

రాజోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కడలిలో శ్రీకపోతేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి టి.నాగవిష్ణు తెలిపారు. కడలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం శ్రీస్వామివారి షష్ఠి, తీర్థ మహోత్సవం, మధ్యాహ్నం 3గంటలకు సర్పవాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాత్రి 7.01గంటలకు స్వామివారి పవళింపు సేవ ఉంటుందన్నారు.

## మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్ మృతికి సంతాపం

అమలాపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఆకస్మిక మృతికి కోనసీమ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ సోమవారం సంతాప సూచకంగా జిల్లా వ్యాప్తంగా దుకాణాలను బంద్ చేశారు. వరప్రకాష్ చేసి సేవలను చెరుకూరి వేణుగోపాలకృష్ణ వివరించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మానే శ్రీను, చీకట్ల ప్రసాద్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## మోడల్ ప్రైమరీ స్కూల్‌లో తనిఖీలు

అంతర్వేది, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వీవీమెరక లో హైస్కూలు, మోడల్ ప్రైమరీ ఉన్నత పాఠశాలను డీఈవో షేక్ సలీంబాషా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సూచనలు చేశారు. అన్ని తరగతులను సందర్శించి హెచ్ఎంలకు సూచనలు అందించారు. ఎంఈవోలు డి.కిశోర్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, జగదీప్, వరలక్ష్మి జాన్‌డేవిడ్ పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో సోమవారం శ్రీఅయినవిల్లి విఘ్నేశ్వరుడు, అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి వార్ల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు ఆయన సూచించారు. తొలుత స్వామి వార్ల ప్రసాదాలను దేవస్థానాల సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఎమ్మెల్యేకు అందించారు. శ్రీఅప్పనపల్లి శ్రీబాలబాలాజీ దేవస్థానం అనువంశిక ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి), నాయకులు వాసంశెట్టి కుమార్, మెండా ఆదినారాయణ, కోటిపల్లి సాయిబాబు, బళ్ల సతీష్ పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మామిడికుదురు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పురాతన ప్రాశస్తి కలిగిన పాశర్లపూడిలోని బీబీ ఫాతిమాజెహరా దర్గాను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం సందర్శించారు. బీబీఫాతిమాజెహరా వర్ధంతిని భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కార్యక్రమానికి రాష్ట్రం వెలుపల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరు కావడం ఆనవాయితీగా వస్తుంది. భక్తులకు ఏవిధమైన అసౌకర్యంకలగకుండాఅన్నిఏర్పాట్లు చేపట్టాలని పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు.

## లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ధర్నా

అమలాపురంటౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్మిక రంగానికి సంబంధించి 29చట్టాలను నిర్వీర్యంచేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అన్యాయంగా దొడ్డిదారిన తీసుకువచ్చిందని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు. నిరసనలో సబ్ యూనిట్ కార్యదర్శి కేవీ సంతోష్, సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.కేశవరావు, కార్యదర్శి కేవీ సంతోష్, కోశాధికారి పి.రమేష్, ఎస్వీఎస్ పోలేశ్వరరావు, బి.జయరామ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

యానాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యానాంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో స్త్రీశిశు సంక్షేమశాఖాధికారి సూరంపూడి రాజేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ అద్దంకి మోహన్ మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ.రత్నప్రభ, విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు బులుసు జానకీ, ఉమెన్ ఇనిషియేటివ్ ఫర్ సస్టైనబుల్ కౌన్సిలర్ కె.శాంతి మాట్లాడారు.

## టీడీపీ బలోపేతానికి పరిశీలకుల నియామకం

పి.గన్నవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పార్టీ బలహీనంగా ఉన్న పోలింగ్‌బూత్‌ల్లో ఇంటింటికి వెళ్లి పార్టీని బలోపేతం చేయడానికి నాలుగుమండలాలకు పరిశీలకులను నియమించినట్లు టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ మోకా ఆనందసాగర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన బూత్ పరిశీలకుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పి.గన్నవరం, మామిడికుదురు మండలాలకు పరిశీలకుడిగా తెలుగురైతు రాష్ట్ర నాయకుడు మట్టా ప్రభాకర్, అయినవిల్లి మండలానికి (ఇద్దరు) ఆక్వాకల్చర్ డైరెక్టర్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేతా శ్రీను, అంబాజీపేట మండలానికి అమలాపురం ఏఎంసీ చైర్మన్‌అధికారి జయలక్ష్మిలను అధిష్టానం నియమించిందన్నారు. టీడీపీ నియోజకవర్గ కో-కన్వీనర్ దాసరి వీరవెంకటసత్య నారాయణ, వివిధ శాఖల రాష్ట్ర డైరెక్టర్లు చెల్లిబోయిన గంగాదేవి, మట్టపర్తి భారతి, అంబటి భూలక్ష్మి, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

మలికిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో పవన్‌కల్యాణ్ పర్యటన దృష్ట్యా లక్కవరం, గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను మంగళవారం ఉదయం 8నుంచి 2గంటల వరకు నిలిపివేస్తున్నట్టు ఏఈ బి.ప్రసాద్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ మలికిపురం మండలంలో పర్యటించే ప్రాంతంలో చెట్ల కొమ్మల నరికివేత, విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో సరఫరా ఉండదన్నారు.

**పవన్ పర్యటనపై ఎమ్మెల్యే కసరత్తు:** రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఈనెల26 ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. గూడపల్లి పల్లిపాలెంలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని, పవన్ పర్యటించే ప్రాంతాలను డ్రైనేజీ, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పంటకాల్వలో అడ్డంకులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అల్లవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు పంటకాల్వ రక్షణ గోడ నిర్మాణంలో కాల్వలో బండరాళ్లు వదిలేసి ఇనుప ఊచలు వంచకుండా వదిలేశారని బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఇనుప ఊచల బండరాళ్ల వల్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు కట్టా నారాయణమూర్తితో పాటు ఆ పార్టీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

## దివ్యాంగ మహాసంఘటన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేష్

అమలాపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ మహాసంఘటన్ రాష్ట్ర విభాగం అధికార ప్రతినిధిగా అమలాపురం పట్టణానికి చెందిన నిమ్మకాయల సురేష్‌ను సోమవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహాసంఘటన్ జాతీయ అధ్యక్షుడు నందూరి రమేష్ ఈమేరకు ఆదేశాలిచ్చారు. మూడో పర్యాయం సురేష్‌ను ఈపదవిలో నియమించారు. రెండేళ్లపాటు పదవిలో సురేష్ కొనసాగుతారు. ఈ సందర్భంగా తనను నియమించిన జాతీయాధ్యక్షుడు రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## శబరిమల యాత్రకు పయనం

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాములు దీక్షను పూర్తి చేసి అయ్యప్ప దర్శనానికి శబరిమల యాత్రకు బయలుదేరినట్టు గురుస్వామి వల్లభరెడ్డి చిన్నాస్వామి తెలిపారు. సోమవారం పళ్లవారిపాలెం పీఠం నుంచి చిన్నాస్వామి ఆధ్వర్యంలో పళ్లవారిపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఇరుముళ్లు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జెడ్.మేడపాడువద్ద ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

## ట్రాఫిక్ పద్మవ్యూహంలో జెడ్.మేడపాడు వంతెన

- వాహనదారులకు తప్పని తిప్పలు
- నిత్యం భారీగా నిలిచిపోతున్న వాహనాలు
- పట్టించుకోని పోలీసులు

మండపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండపేట రూరల్ జెడ్.మేడపాడు వంతెనవద్ద నిత్యం వాహనాలు నిలిచిపోతుండటంతో వాహనదారులు, ప్రజలు నరకం చూస్తున్నారు. మండపేట, రామచంద్రపురం, రావులపాలెం, రాజమహేంద్రవరం, కాకినాడ, డిపోలకు చెందిన బస్సులు కెనాల్ రోడ్డుగుండా సామర్లకోట కాకినాడ, రాజమహేంద్రవరం వెళుతుంటారు. గ్రావెల్ లారీలు, బియ్యం, ధాన్యం లోడులతో లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు నిత్యం వందల సంఖ్యలో మండపేట ద్వారపూడి, సామర్లకోట, రాజమహేంద్రవరం వెళుతుంటాయి. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే జెడ్.మేడపాడు వంతెన వద్ద ట్రాఫిక్ నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు అడ్డదిడ్డంగా పెడుతున్నారు. కెనాల్‌రోడ్డులో వంతెనవద్దనుంచి కేశవరం ద్వారపూడి ఇప్పనపాడు వైపు భారీగా వాహనాలు నిలిచిపోయి నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రించే వారు లేకపోవటంతో వాహనదారులు స్థానికులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉండే జెడ్.మేడపాడువద్ద ట్రాఫిక్‌జాం అయినా నియంత్రించే పరిస్థితి లేకపోవటంతో ప్రజలు మండిపడుతున్నారు. ద్వారపూడిలో రైల్వేస్టేషన్ అయ్యప్పస్వామివారి ఆలయం బట్టలమార్కెట్, ద్వారపూడి కేశవరంలో నుంచి వచ్చే గ్రావెల్ లారీలతో ట్రాఫిక్ పెరిగిపోయిది. ఇప్పటికైనా నిత్యం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళ నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుండటంతో ప్రజలు, విద్యార్థులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జెడ్.మేడపాడువద్ద రెగ్యులర్‌గా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటుచేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. సోమవారం జెడ్.మేడపాడువద్ద వంతెనవద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులెవరూ లేకపోవటంతో అనపర్తి ఫైర్‌అధికారి శ్రీనువాస్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను నియంత్రించటంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.



ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న అనపర్తి ఫైర్ అధికారి

## మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీవరప్రకాష్ మృతిపై పలువురి సంతాపం

మండపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):మండపేట పట్టణానికి చెందిన టీడీపీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పలువురు నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. టీడీపీ యువనేత వల్లూరి సాయికుమార్ బాబు, ఆలమూరు మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, వైసీపీనేత రెడ్డి రాధాకృష్ణ, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, ఆలమూరు తాలుకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ(చంటి), కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, సంఘ సభ్యులు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, ఏడిద సర్పంచ్ బూరిగ అశీర్వాదం, మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూకదుర్గారాణి, అల్‌ఇండియా పాస్టర్స్ పెలోషిప్ జాతీయ ప్రధాన కార్యదర్శి డెనియెల్‌పాల్, బీజేపీ నాయకులు కె.సాయిరామ్, కె.సత్యనారాయణ, జిన్నూరి సాయిబాబా, మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మచ్చా నాగు, మండపేట మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించిన సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన నాయకులు తరలివచ్చి నివాళులర్పించారు.

**రాయవరం,(ఆంధ్రజ్యోతి):** మండపేట మున్సిపాల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఆకస్మిక మృతిపట్ల మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. రాయవరం టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు మాట్లాడుతూ శ్రీవరప్రకాష్ మృతి పార్టీకి తీరనిలోటుగా పేర్కొన్నారు. శ్రీవరప్రకాష్ మృతి పట్ల రామచంద్రపురం వాటర్ డీసీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, ఎంపీటీసీలు ఉండవిల్లి సుబ్బారాయుడు, వైట్ల సతీష్, మాజీ జట్పీటీసీలు కాదా ప్రభాకరరావు, కర్రి వెంకటరెడ్డి, చుండ్రు వీర్రాజు, నూనే ఏసుబాబు, రిమ్మలపూడి వేణుగోపాలదొర, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి, సహకార సంఘాల అధ్యక్షులు మేడపాటి రవీంద్రారెడ్డి, పిల్లి గణేష్, శాకా కోటేశ్వరరావు, సత్తి వెంకట కృష్ణారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## సంక్షేమ పథకాలు, సేవలపై రైతులకు అవగాహన

- రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం



రైతన్న మీకోసం కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

కె.గంగవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 రైతు సేవా కేంద్రాల్లో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై రైతులకు అవగాహన కల్పించడం ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సచివాలయాల్లోని గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, ఇంజనీరింగ్, ఎనర్జీ అసిస్టెంట్లు గ్రూపుగా ఈనెల 24 నుంచి వచ్చేనెల 2 వ తేదీ వరకు 100 కుటుంబాలకు అవగాహన కల్పించేలా ఈకార్యక్రమం ఉంటుందన్నారు. దీనిలో భాగంగా స్మార్ట్ చరవాణి కలిగిన ప్రతి రైతు ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సేవలను గడప ముందుకు తీసుకువెళ్లడం ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లూరి దొరబాబు, కొరిపెల్ల సుబ్బారావు, కూమటి నాయకులు వీపీప నవ్యసుధా చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు అందజేత



కపిలేశ్వరపురం పాఠశాలలో పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మణరాజు

కపిలేశ్వరపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆపాఠశాల హిందీ ఉపాధ్యాయుడు వేదరాజులక్ష్మణరాజు ఎన్‌ఎం ఎంఎస్ పుస్తకాల మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ ఉపకార వేతనం కోసం నిర్వహించే పరీక్షకు సిద్ధమవుతున్న 20 మంది విద్యార్థులకు ఆయన తన సొంత ఖర్చుతో ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మణరాజును పాఠశాల హెచ్‌ఎం వి. శ్రీనివాస్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి సతీష్, తదితరులు అభినందించారు. అలాగే వెదురుమూడి ప్రాథమిక పాఠశాలలో నవోదయ పరీక్షకు హాజరుకానున్న 10 మంది విద్యార్థులకు హిందీ టీచర్ లక్ష్మణరాజు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్టులో రాయవరం విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన రాయవరం హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం.

రాయవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం విప్పర్తి శాంతి సునీత తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు పిచ్చుక జయంత్ వెం కటనాగ్, కాకరపర్తి దాత్రి లలిత, బూర ఆనంద్‌బాబులు జిల్లాస్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామికి తమలపాకు పూజ చేస్తున్న దృశ్యం

మండపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మార్గశిరమాసంను పురష్కరించుకుని సోమవారం కరాచి సెంటర్‌లో వున్న అభయ ఆంజనేయస్వామిఆలయంలో ఆలయ అర్చకులు ఖండవల్లి పవన్‌కుమార్ సారథ్యంలో స్వామివారి విశేష పూజలు తమలపాకు గంధ సింధూర పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలుచేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఆహ్వానపత్రికలు పంపిణీ



అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు అందజేస్తున్న ఆహ్వానపత్రికలు

కపిలేశ్వరపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు సోమవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో డోలు, సన్నాయి వాయిద్యాలతో ఇంటింటికీ తిరిగి స్వామివారి కల్యాణోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఈ ఆహ్వాన పత్రికలను అందజేసినట్లు ఆలయ ఈవో ఎం.శ్రీదేవి, ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు.

## మంత్రి నాదేండ్ల పర్యటన రద్దు

మండపేట, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ మండపేట పర్యటన వాయిదా పడిందని ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ సోమవారం ఓకప్రకటనలో తెలిపారు. మంత్రి నాదెండ్ల మంగళవారం మండపేటలో రైతులతో స్థానిక ఎమ్మెల్యే వేగుళ్లతో కలిసి పాల్గొనాల్సి ఉందని అయితే అనివార్యకారణాలవల్ల పర్యటన రద్దయిందని ఎప్పుడు మంత్రి వచ్చేది త్వరలోనే ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

## రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పంచసూత్రాల ఆధారంగా సాగునీటి సంరక్షణ డిమాండ్ ఆధారిత పంటల ప్రోత్సాహం అధిక దిగుబడి వచ్చే వ్యవసాయ పద్ధతులు అగ్రిటెక్ వినియోగం ఫుడ్ ప్రొసెస్సింగ్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతు ఆదాయం పెంచే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని ముమ్మిడివర్పాడులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా ఆయన రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ కలిసి రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం పథకాల వివరాలు, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను రాజులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శాస్త్రీయ విధానాలు, ప్రకృతి వ్యవసాయం, టెక్నాలజీ వినియోగం, తదితర వాటి ద్వారా రైతులకు లాభసాటి వ్యవసాయం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గుచూపాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యం చేయాలన్నారు. అనంతరం జీవామృతం తయారీ విధానాలు, వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణ మాట్లాడుతూ రైతులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల వైసీపీ నాయకులు కోటి సంతకాల పేరిట అసత్య ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాజవరం- పొదలాడ రోడ్డు నుంచి గోపాలపురం జాతీయ రహదారి వరకూ విస్తరించి ఉన్న కాలువ గట్టు రహదారిని ఆధునీకరించాలని వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.దీనిపై ఆయన మాట్లాడుతూ త్వరలో ఆధునీకరణ పనులు చేపట్టి రైతులకు సుందరమైన రహదారిని గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, ఆత్మకమిటీ చైర్మన్ జక్కంపూడి బాలాజీ, మైగాపుల గురవయ్యానాయుడు, పెచ్చెట్టి చిన్నారావు, అడపా పార్థసారధి, అడపా హనుమంతరావు, కాప నాగరాజు, తొత్తరమూడి శ్రీను, అడపా శివగోవిందు, మాసాబత్తుల ఆనందరావు, అధికారులు పాల్గొన్నారు.

## సెప్టిక్ ట్యాంక్ వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచార వృత్తిలో ఉన్న నిరుద్యోగులకు ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను రాయితీపై అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. అర్హులైన వారు కాకినాడ ప్రగతి భవన్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీలోపు స్వయంగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు.

## ఇద్దరిపై డ్రంక్ డ్రైవ్ కేసు

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం ఆత్రేయపురం రేవులో వాహనాల తనిఖీలో భాగంగా ఇద్దరు వ్యక్తులకు బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షించగా అతిగా మద్యం తాగినట్టు నిర్ధారణ కావడంతో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

## ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

రాజవరం-వెలిచేరు రోడ్డులో పెరిగిన తుప్పలు.. రాత్రుళ్లు ప్రమాదాలు



రాజవరం-పొదలాడ ఆర్‌అండ్‌బీ రహదారి

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజవరం-పొదలాడ ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రాజవరం-వెలిచేరు రహదారి ఇరువైపులా తుప్పలు పెరిగిపోయి రోడ్డు ఇరుకుగా మారింది. ఎదురుగా వాహనం వస్తే తప్పుకునే మార్గం కానరావడంలేదు. మలుపుల వద్ద తుప్పలు పెరిగిపోయి రాత్రుళ్లు ప్రమాదాలకు నిలయంగా మారింది.అటు పంచాయతీ అధికారులు గానీ, ఇటు ఉపాధి హామీ పథకం అధికారులు గానీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబించడంతో వాహనచోదకులతో పాటు రైతులు తమ పంటలను తరలించుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని, స్థానికులు, రైతులు కోరుతున్నారు.

## ర్యాలి ఫౌండేషన్ పాఠశాల సందర్శన



ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలి ప్రధాన ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాలను సోమవారం పరిశీలకురాలు, డైట్ లెక్చరర్ ఎల్.చోడమణి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల గుణాత్మక విద్యకు రూపొందించిన జీఎఫ్ ఎల్ఎఫ్ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు కిచెన్ గార్డెన్స్‌లో పెంచుతున్న కూరగాయల సాగును పరిశీలించి చిన్నారులను అభినందించారు. విలువలతో కూడిన విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయుడు శ్యామ్‌ను అభినందించారు. డైట్ విద్యార్థి నీలవేణి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు.

## జొన్నాడలో ఉయ్యాలవాడ జయంతి

ఆలమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ పోరాటయోధుడు ఉయ్యాలవాడ నరసింహరెడ్డి జయంతిని సోమవారం నిర్వహించారు. జొన్నాడ వేమనరెడ్డి సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమ తొలినాళ్లలో ఆయన చేసిన పోరాటం ఎంతోమంది ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిందని పలువురు వ్యక్తులు కొనియాడారు. కార్యక్రమంలో వేమన రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## అర్హులకు గృహనిర్మాణ రుణాలు: ఎంపీడీవో



ఆలమూరులో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గృహాలు నిర్మించుకోవాలనుకునే వారికి రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని, ఈ సర్వేలో తమ పేర్లును నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరులో సోమవారం ఆయన ఎంఈవో బి.అప్పాజీతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను గుర్తించేందుకు జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వేలు జరుగుతున్నాయని, అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలజూట పేర్కొన్నారు.

## వెంకన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి ఆలమూరుకు చెందిన వెత్సా రవికుమార్,శ్రీరామకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం సమర్పించారు.దాతలకు ఆలయాధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.భక్తుల రద్దీ దృష్ట్యా లైన్ల పనులను పరిశీలించి సూచనలు చేశారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్‌కు డస్ట్‌బిన్లు అందజేత



కాంప్లెక్స్ డస్ట్‌బిన్లు అందిస్తున్న అవంతి సీఫుడ్స్ ప్రతినిధులు

రావులపాలెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు గోపాలపురంలో ఉన్న అవంతి సీఫుడ్స్ సంస్థ డస్ట్‌బిన్లు అందజేసింది. స్థానిక కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అవంతి హెచ్‌ఆర్ ప్రసాద్ రూ.60 వేలు విలువైన 15 డస్ట్‌బిన్లు అందజేశారు.కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ మైగాపుల గురవయ్యనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ ఎం.అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు.

## కళ్లజోళ్ల పంపిణీ

ఆలమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గ్రామంలో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో దృష్టి లోపాలు ఉన్నట్టు గుర్తించిన 73 మందికి ట్రస్ట్ అధినేత బూసి విద్యాప్రసన్న సమకూర్చిన కళ్లజోళ్లను టీడీపీ మండలాధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సత్యం స్టడీ ఇన్‌స్టిట్యూట్ అధినేత బూసి విద్యాసాగర్‌లు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు ఈదల నల్లబాబు, వడ్డి దొరయ్యనాయుడు, బొడపాటి మారుతీ, పాలూరి గోవిందు, గట్టి సుబ్రహ్మణ్యం, ముప్పిరి వెర్రియ్య, దిడ్డి రాము పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన ర్యాలీ



రావులపాలెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. రావులపాడులో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం సోమవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా బాల్యవివాహల వల్ల కలిగే అనర్థాలపై ర్యాలీ నిర్వహించారు. జిల్లా కమ్యూనిటీ సోషల్ వర్కర్ పి.నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి బాల్యవివాహల చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు.

## పురోహితుడికి మంత్రి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో పేద పురోహితుడికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం అందించారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దర్శనం నిమిత్తం వెళ్లిన మంత్రి సుభాష్ పురోహితుడు సూర్యనారాయణమూర్తి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని రూ.10 వేలు చెక్కు అందజేశారు. ఇదిలా ఉండగా టీడీపీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలు నక్కా వెంకటేష్, ఉజూరి శంకరరావు ఇటీవల అకాల మృతిచెందారు. ఇద్దరూ పార్టీ కోసం పనిచేశారు. దీంతో పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి బీమా సొమ్ము ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరైంది. సదరు సొమ్మును స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి సుభాష్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వాసంశెట్టి సత్యం, ఉండవల్లి శివ, గడిగోవింద, తాళాబత్తుల మురళీకృష్ణ పాల్గొన్నారు